ఘనంగా అర్పణల పండుగ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నగరంలోని సి.ఎస్.ఐ సెంట్రల్ చర్చ్‌లో ఆదివారం ఉదయం కృతజ్ఞత అర్పణల పండుగను ఘనంగా నిర్వహించారు. సిఎస్ఐ సెంట్రల్ చర్చ్ రాయలసీమ అధ్యక్ష మండల పీఠాధిపతి రైట్ రెవరెండ్ డాక్టర్ టి ఐజక్ వరప్రసాద్ సతీమణి, రాయలసీమ డయాసిస్ ఉమెన్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు అయిన సిడి భారతి ఐజాక్ తల్లి కృతజ్ఞత అర్పణల పండుగ విశిష్టతను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో కడప సి ఎస్ఐ సెంట్రల్ చర్చ్ ఉమెన్ ఫెలోషిప్ అధ్యక్షురాలు సరస్వతి మత్తయిబాబు, ఉపాధ్యక్షురాలు స్వరూపారాణి రాజన్న, కార్యదర్శి గ్రేస్ ప్రమీల సాగర్, సంయుక్త కార్యదర్శి జంబారపు రాజామణి రాజు, కోశాధికారి కళ్యాణి విజయ్ కుమార్, ఉమెన్ ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు.

జీవోనంబరు-1ను ఉపసంహరించుకోవాలి: సీపీఐ

విశాలాంధ్ర-తొండూరు: వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు-1ను వెంటనే ఉపసంహరించు కోవాలని సీపీఐ పులివెందుల ప్రాంత కార్యదర్శి వెంకటరాములు, తొండూ రు మండల కార్యదర్శి మిద్దె మురళీలు డిమాండ్ చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ సభలు, ర్యాలీలు, సమావేశాలు నిషేదిస్తూ జగన్ సర్కారు విడుదల చేసిన జీవో అప్రజాస్వామికమన్నారు. కానీ గతంలో ఎన్‌టి రామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు, షర్మిల, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ కూడా పాదయాత్రలు చేశారన్నారు. అప్పుడు లేని అడ్డంకుడు ఇప్పుడు వచ్చాయా అంటూ వారు ప్రశ్నిం చారు. ఈ జీవో బ్రిటిష్ వారి పాలనలో విడుదల చేసినా వారు అప్పుడు కూడా కఠినంగా వ్యవహరించలేదన్నా రు. అలనాటి జీవోను పునరుద్ద రించి విడుదల చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతుం దన్నారు. కావున వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీవోనంబరు-1ను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ పరిధిలోని శిల్పారామంలో పరిపాలనాధికారి సుధాకర్ పర్యవేక్షణలో ఆదివానం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. విజయవాడ వారి ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్ వేసవి తరగతులు ప్రారంభించిన సందర్భంగా పులివెందుల గౌసియా బోటిక్ వారి సహకారంతో డైరెక్టర్ కుమార్, చిట్టి డ్యాన్స్ మాస్టర్ అధ్వర్యంలో ఆ ఇన్స్టిట్యూట్ చిన్నారుల ఆధ్వర్యంలో జానపద మరియు వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఆకాశం తన రెక్కలతొ నను కప్పుతు ఉంటే భూలోకం నను నిద్దర పుచ్చాలి, ఫ్రీడమ్ ఫ్రీడమ్ పొగరు పోటీ మాదే వయసు వేడి మాదే, రంగమ్మ మంగమ్మ ఏం పిల్లడు.., చందమామ ఒకటి సరదాగా నేలకొచ్చినాదంట, సొమ్మసిల్లి పోతున్నవే ఓ సిన్నా రాములమ్మ, నేనట్టాంటిటాంటడదాన్ని కాదు బావో పల్సరు బైక్ మీద రాను బావ,నర్సపేల్లే గండిలోన గంగధారి. ఆడనెమలి ఆటలకు గంగధారి తదితర పాటలకు నృత్య ప్రదర్శనలు ఎంతో అలరించాయి.

జంగాలపల్లి గ్రామంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం

విశాలాంధ్ర-సిద్ధవటం : సిద్ధవటం మండలం లోని జంగాలపల్లె గ్రామ పంచాయతీ లోని ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాల గురించి ఇంటింటికి తిరిగి కరపత్రా లు పంపిణీ చేసి ప్రజల యొక్క కష్టసుఖాలు అడిగి తెలుసు కున్నారు మాతో కలసి పోరాడాలనుకుంటే 9261292612 నెంబర్‌కు మిస్సుడు కాల్ ఇవ్వండి అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం మండల పార్టీ అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి మండల క్లస్టర్ ఇంచార్జి దశరథ నాయుడు, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య, జంగాలపల్లె మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, జంగాలపల్లె గ్రామ కమిటీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, మూలపల్లె మాజీ సర్పంచ్ బిసి నేత కేథీబోయిన రాజశేఖర్,బూత్ కమిటీ అధ్యక్షులు మురళి నాయుడు,జంగాలపల్లె ఉపసర్పంచ్ వెంకట సుబ్బ య్య రాజంపేట మైనారిటీ అసెంబ్లీ అధ్యక్షులు నాగూర్ వీరభద్రయ్య, అసెంబ్లీ అధికార ప్రతినిధి కథితం రామ్మోహన్ నాయుడు,ఎస్ రాజంపేట టిడిపి బూత్ కన్వీనర్ పార్ల శ్రీనివాసులు యూనిట్ ఇంచార్జి వీరనాల రామచంద్ర, మాధవరం నాయకుడు గూండ్ల నాగేంద్ర,తెలుగు యువత మామిళ్ళ మురళి, ఆడిటర్ పుత్తా శివనంద.ఐటిడిపి బషీర్ మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆరవ రోజుకు చేరిన నిరసన

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లి మండలం తహసిల్దార్ కార్యాల యం ఎదురుగా ఆల య భూముల పరిరక్షణ సమితి కన్వీనర్ కొండూరు వెంకటరామరాజు, కో కన్వీనర్ చెంచర్ల ఆంజనేయులు, విహెచ్‌పి లక్కిరెడ్డిపల్లె ప్రఖండ అధ్యక్షులు ఎస్సార్ ఆంజనేయ రెడ్డి, విహెచ్పి రామాపురం మండలం ఉపాధ్యక్షులు ఎంవి భాస్కర్ రెడ్డిల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి ఆరవ రోజుకు చేరుకున్నాయి. అనంతరం లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామంలోని శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ దేవస్థానం ఆవరణంలో భజన బృందాలచే నిరసన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుడుముల రామచంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ పురాతన దేవాలయం సుమారు 700 సంవత్సరాల క్రితమే నిర్మితమై ఇక్కడ భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పిలువబడుతున్న ఈ అమ్మవారి ఆలయ భూములపై ఆలయం పరిసరాలలో ఉన్న ప్రభుత్వ భూములపై కొంతమంది స్వార్థ రాజకీయ నాయకుల కళ్ళు పడడంతో, ఈ భూములను సొంతం చేసుకునే దురుద్దేశంతో, వారి రాజకీయ పలుకుబడిని ఉపయోగించి రెవెన్యూ ఎండోమెంట్ అధికారులపై ఒత్తిడి చేసి ఈ భూములను ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని గంగమ్మ భూముల ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు మరియు విశ్వహిందూ పరిషత్ నాయకులు గత ఆరు రోజులుగా నిరసన నిరాహార దీక్ష ద్వారా అధికారులకి తెలియబరుస్తున్న, రెవెన్యూ అధికారులు గానీ, ఎండోమెంట్ అధికారులు గానీ, జిల్లా అధికారులు గానీ, ఎలాంటి చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. లక్కిరెడ్డిపల్లి మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ తల్లి దేవస్థానం ఆవరణంలో అమ్మవారి భక్తులచే భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని తెలిసే విధంగా వారు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కోరుకుంటూ సమస్య ను పరిష్కరించ వలసిందిగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆలయ భూముల పరిరక్షణ సమితి సభ్యులు తిరుపతి శ్రీరాములు, తిరుపతి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

భజరంగ దళ్‌తో పాటు ఆర్ఎస్ఎస్‌ను నిషేధించండి

2024లో బిజెపి, సంఘ పరివార్ రాజకీయ సమాధి: కాంగ్రెస్ పార్టీ నేతలు నజీర్ అహ్మద్, అలీఖాన్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : దేశంలో అరాచకం సృష్టిస్తూ గోవధ పేరిట అమాయకులైన ముస్లింలను ఊచకోత కోస్తున్న భజరంగ్దళ్‌తోపాటుగా దాని మాతృ సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్‌ను కూడా దేశవ్యాప్తంగా నిషేధించాలని ఉమ్మడి కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. కడపలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం వారి ఇరువురు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో బజరంగ్దళ్ తో పాటు పిఎఫ్ఐ ను కూడా నిషేధిస్తామని ప్రజలకు పార్టీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. తదనంతరం భారతీయ జనతా పార్టీ తో పాటుగా బజరంగ్దళ్ గుండాలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించారు. మధ్యప్రదేశ్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బజరంగ్దళ్ బిజెపి గుండాలు విధ్వంసం సృష్టించారని ఆరోపించారు.అలాగే తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ గాంధీభవన్లో బజరంగ్దళ్ గుండాలు చొరబడేందుకు ప్రయత్నం చేశారని విమర్శించారు.అలాగే తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో కూడా బిజెపి ,బజరంగ్దళ్ నాయకులు విధ్వంసం సృష్టించడానికి చేసిన ప్రయత్నాలు తప్పుపట్టారు. భారత దేశంలో గోవధ పేరిట అమాయకులైన ముస్లింలను భారతీయ జనతా పార్టీతో పాటుగా ఆర్ఎస్ఎస్, భజరంగ్దళ్ ,విశ్వహిందూ పరిషత్ హిందూ వాహిని తదితర అసాంఘిక సంస్థలు మట్టుబెడుతున్నాయని ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగానికి,భారతదేశానికి అత్యంత ప్రమాదకరంగా పరిణమించిన వీటన్నిటిని వెంటనే దేశవ్యాప్తంగా నిషేధించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రంలో తొలిసారిగా బజరంగ్దళ్ ను నిషేధిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడం హర్షదాయకమన్నారు. అలాగే ఆర్ఎస్ఎస్ ను కూడా వెంటనే నిషేధించి దేశంలోని సెక్యులర్ సమాజాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు .కేవలం మతాల పేరిట విద్వేషాలు వ్యాప్తి చేస్తూ అధికారం కోసం కేవలం ముస్లింలు, బలహీనవర్గాలను లక్ష్యంగా చేసుకొని వారిని సజీవంగా దహనం చేస్తున్న అత్యంత పాశవీక దాడులు చేస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్రాల్లో అధికారములో ఉన్న ఈ మత పిశాచ భారతీయ జనతా పార్టీ, దాని మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ లు 2024 ఎన్నికల్లో రాజకీయ సమాధి కాక తప్పదని హెచ్చరించారు. కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసం భగవంతుడైన హనుమంతుని విమర్శించారని బిజెపి అబద్ధాలు ప్రచారం చేస్తోందన్నారు. బజరంగ్ దళ్ లాంటి అసాంఘిక నేరమయ ఘోర సంస్థను భగవంతునితో పోలుస్తూ కర్ణాటక ఎన్నికల్లో లబ్ధి పొందడమే పనిగా బిజెపి పెట్టుకుందని ధ్వజమెత్తారు. ఈ లాంటి నీచ రాజకీయ పార్టీ మనుగడతో భారతదేశానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. కేవలం హనుమాన్ చాలీసా లాంటి దైవ జపం పవిత్రంగా చేయాల్సిన కార్యాన్ని రాజకీయాలకు కూడా వాడుకోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు .కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన బజరంగ్దళ్ నిషేధంపై బిజెపి భయంతో వణుకుతోందన్నారు. రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీకి ఆర్ఎస్ఎస్ కు పుట్టగతులు ఉండవన్నారు. ఇప్పటికే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వాలు బజరంగ్దళ్ లాంటి నేర సంస్థలను ప్రోత్సహిస్తూ ముస్లింలపై భౌతిక దాడులకు ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. ఈ అమానుష కాండను ,నేరాలను ఖండిస్తున్నామన్నారు.రానున్న లోక్సభ ఎన్నికల తర్వాత బిజెపి ఆర్ఎస్ఎస్ బజరంగ్దళ్ చేసిన నేరాలు-ఘోరాలపై చట్టపరంగా విచారణ చేసి శిక్షిస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో మతం పేరిట రాజకీయాలు చేసేందుకు భారతీయ జనతా పార్టీ సాహసించదని పేర్కొన్నారు. 2019 సాధారణ ఎన్నికల్లో బాబ్రీ మసీదును తొలగించి రామాలయం నిర్మిస్తామని బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని వారు గుర్తు చేశారు. ఇతర పార్టీలు కూడా తమ ఎన్నికల మేనిఫెస్టో లో ప్రకటించుకునే అధికారం,హక్కు కలిగి ఉన్నాయన్నారు.దీనిపై బిజెపి ఇతర అల్లరి మూకల సంస్థలకు అభ్యంతరం ఏముంటుందని ప్రశ్నించారు. భారత రాజ్యాంగం ప్రకారం ఎన్నికల చట్టం ప్రకారం మతాన్ని దురుపయోగం చేస్తున్న భారతీయ జనతా పార్టీపై భవిష్యత్తులో వేటువేయడం అనివార్యమని హెచ్చరించారు. దేశ ప్రజలందరూ భారతీయ జనతా పార్టీ నేరాలు, ఘోరాలు,దుర్మార్గాలు దాడులను గమనిస్తున్నారని, 2024లో బిజెపి ఆర్ఎస్ఎస్‌కు రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు భాస్కర్ బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు గ్రామపంచాయతీ అభివృద్ధికి పీలేరు యువ సర్పంచ్(యంగ్ స్టార్)హబీబ్ భాషా దూకుడు పెంచారు. పీలేరు గ్రామపంచాయతీలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి పీలేరు పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటింటికి కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా సర్పంచ్ హబీబ్ భాష మాట్లాడుతూ కరోనా కారణంగా మరియు ప్రకృతి వైపరీత్యాల వలన రైతులు మరియు వ్యాపారస్తులు ఆర్థికంగా నష్టపోయినందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి,ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహాయ సహకారాలతో గ్రామ పంచాయతీకి చెందిన వారపు సంత దినసరి మార్కెట్ వేళమును సొంత నిధులతో గ్రామపంచాయతీకి మొత్తం చెల్లించి రైతులకు వ్యాపారస్తులకు గేటు రుసుము లేకుండా ఉచితంగా ఇచ్చిన ఘనత తమకే దక్కిందని పేర్కొన్నారు.పీలేరు గ్రామపంచాయతీలో గత 21 వ సంవత్సరం ఏప్రిల్ మాసం నుండి ప్రస్తుతం వరకు జరిగిన అభివృద్ధి పనులను వార్డుల వారిగా పీలేరు ప్రజలకు ఆయన తెలియజేశారు.పీలేరు పంచాయితీలో సుమారు 20 వార్డులు ఉన్నాయని అందులో వార్డు వారీగా సభ్యులు ఉప సర్పంచ్ జీనత్,ఉదయ్ కుమార్, లావణ్య,లలితమ్మ, స్వర్ణ, సంధ్యావాణి, సరస్వతమ్మ, సతీష్ కుమార్ రెడ్డి, అస్మత, ఖాదర్ బాషా, ఇన్మతరా బేగం, విక్టరీ వెంకటరమణారెడ్డి, ఎం. శ్రీనాథరెడ్డి, కళావతి, పరమేశ్వర ప్రసాద్, సుకన్య, అభిద్,అత్తర్ షేక్ హబీబ్, కళావతి,షాహినా ఇలా వార్డు సభ్యులతో కలసి పీలేరు పంచాయతీ అభివృద్ధికి దోహదపడుతున్నామని తెలిపారు.అలాగే మస్జిద్-ఏ-అక్సా దగ్గర కొత్త బోర్ ఏర్పాటు చేశామని,కొత్తపల్లి సంప్‌లో బోర్ మోటర్ రిపేర్ చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎన్.వి.చలపతి,వైస్ ఎంపీపీ హరిత పెద్దోడు,అల్లబక్షు,ఈఓ ప్రసాద్రెడ్డి, గడి బాష,కుసుమ శేఖర్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఘనంగా నిత్య కళ్యాణమూర్తుల బ్రహ్మోత్సవాలు ముగింపు

విశాలాంధ్ర - కమలాపురం : ఈనెల మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు మండల పరిధిలోని రామాపురం పుణ్యక్షేత్రంలో ఐదు రోజులపాటు దేవతామూర్తులు శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణ స్వామి శ్రీ వల్లి దేవసేన దికందర షణ్ముఖ సుబ్రమణ్య స్వామి సంజీవిని మాలిక సహిత వీరాంజనేయ స్వామిలు వాస్తవాలు అంగరంగ వైభవంగా ఆలయ నిత్య సేవకుడు కాశిభట్ల సాయినాథ్ శర్మ ఆలయ పుణ్యభూమి చారిటబుల్ ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండపారాధన దేవత మూర్తులు హెూమాలు మహారథి కుంభాభిషేకం చక్రస్థానాలు మహా మంగళ హారతులు దేవత మూర్తులకు వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాలు సందర్భంగా న్యూ క్యాటగిరి వృషభ రాజులచే బండలాగుడు పోటీలు ఆలయ నిత్య సేవకుడు తెలుగుదేశం మాజీ రాష్ట్ర కార్యదర్శి సాయినాథ్ శర్మ ప్రారంభించారు. ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 40 వేలు, తృతీయ బహుమతిగా రూ.30 వేలు, నాలుగవ బహుమతిగా రూ. 20000, ఐదవ బహు మతిగా రూ.10 వేలు, ఆరో బహుమతిగా రూ.5000లు, ఎడ్ల యజమానులకు నగదు బహుమతితో పాటు ఆటో రివర్స్ పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందే ఆలయ నిత్య సేవకుడు సాయినాథ్ శర్మ ఆలయ పుణ్య భూమి సభ్యులు ఆధ్వర్యంలో ఆలయంలోని దేవత మూర్తులను నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు జి. వీరశివారెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయిపల్లి మల్లి కార్జున్ రెడ్డి, కమలాపురం శాసనసభ్యుడు పి రవిరెడ్డి ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు సాంప్రదాయ బద్ధంగా వేద పండితులు స్వాగతం పలికారు. స్థానిక నాయకులు పలువురు అధికారులు దేవతను దర్శించుకుని కాయకపురం సమర్పించారు. జబర్దస్త్ శ్రీదేవి డ్రామా కంపెనీ కళాకారుల అద్భుతమైన ఆనందకరమైన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేల్, పులివెందల తదితర నగరాల నుండి పెద్ద ఎత్తున మహిళా భక్తులు దేవతామూర్తులను దర్శించుకున్నారు.

ముస్లిం, మైనారిటీలకు ఏం చేశారు :ఇన్సాఫ్

విశాలాంధ్ర-కడప రూరల్ : ముస్లిం మైనారిటీలను ఓటు బ్యాంకు రాజకీయాల లో బలి పశువులు చేస్తున్నారని ఒకసారి అవకాశం ఇవ్వండి అంటే పాదయాత్రలో మీరు ఇచ్చిన హామీలను ముస్లిం మైనారిటీ ప్రజలు నమ్మి మీకు ఓట్లు వేసి అధికారం ఇస్తే వీరిని వాడుకొని గాలికి వదిలేశారని బిజెపి నాయకులు ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెబుతున్న ఏమి మాట్లాడకపోవడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తగదని ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి ఎస్. షరీఫ్‌లు విమర్శించారు. ఆదివారం హెరాచిమిన్ భవన్ యందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షరీఫ్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులను ఆక్రమించిన ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు లేవని,వక్ఫ్ ఆస్తులను రీసర్వే పరిరక్షణ చేస్తామని మరిచారని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులు ఆక్రమించుకున్న వారి ఆధారాలతో ఎన్ని ఫిర్యాదులు ఇచ్చిన పట్టించుకోని పరిస్థితి అన్నారు. ముస్లిం మైనారిటీలకు సబ్ ప్లాన్,మైనారిటీ కార్పోరేషన్,వడ్డీ లేని రుణాలు మైనారిటీలకు సబ్సిడీ రుణాలు ఎంత మందికి ఇచ్చారు,ముస్లిం మైనారిటీ చెల్లెమ్మల గత నాలుగు సంవత్సరాల కాలంలో వివాహాలకు దుల్హన్ పథకం కింద ఎంత మందికి అందజేశారో చెప్పాలన్నారు. హజ్ యాత్రకు ఆర్థిక సాయం అన్నారు, వున్న హజ్ హౌస్ ఎందుకు ప్రారభించలేదని? ఎంత మంది ఇమాంలకు ఇళ్ళ స్థలాలు కేటాయింపు చేసి ఇళ్ళు కట్టించారని ఆయన అన్నారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీలను మీరు నెరవేర్చారా అని ప్రశ్నించారు. ముస్లింల, మైనారిటీలకు కేటాయించిన నిధులను ముస్లింల అభివృద్ధికి కేటాయించకుండా మీ గొప్పలకు సంక్షేమ పథకాలకు కేటాయించి ముస్లింలకు ద్రోహం చేశారని ఆయన అన్నారు. ఉర్దూ స్కూల్లలో మౌలిక వసతులు , విద్యార్థులు సరిపడా ఉపాధ్యాయులను కేటాయించిన దాఖలాలు లేవని ఇది ముస్లింలకు విద్యను దూరం చేయడం కాదా ఇలా ముస్లింలపై వివక్షత చూపుతూ వుంటే ముస్లిం మైనారిటీ ప్రజలు ఎలా అభివృద్ధి చెందుతారని ఆయన అన్నారు. ముస్లింలకు మీరు ఇచ్చిన హామీలపై స్వేతపత్రం విడుదల చేయాలని వారన్నారు. ఇప్పటికైనా మీరు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముస్లిం మైనారిటీ ప్రజలను అభివృద్ధి పరచాలని లేనిచో రాబోయే ఎన్నికలలో ముస్లిం మైనారిటీ ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు కేసి.బాదుల్లా, నగర కార్యదర్శి ఎస్‌కె మైనుద్దీన్, ఉపాధ్యక్షులు ఆర్.బాబులు పాల్గొన్నారు.

బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి మణికంఠ రాథోడ్‌పై విచారణ జరిపించాలి: తులసిరెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల రూరల్: కర్నాటక రాష్ట్రం కళిదుర్గ జిల్లా సిద్దాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి మణికంఠ రాథోడ్ చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని కాంగ్రెస్‌పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ కార్యాల యంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ ఇటీవల కాలంలో మణికంఠ రాథోడ్ తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేపై అనుచిత వ్యాఖ్యాలు చేశార న్నారు. అవి కూడా ఖర్గే కుటుంబాన్ని మట్టుపెడతాంటూ అభ్యంతకర వ్యాఖ్యాలు చేశారన్నారు. ఈ వ్యాఖ్యాలను తమ పార్టీ ఏఐసీసి కార్యదర్శి రణదీప్‌సూర్జిత్‌వాలా ఆడియోరూపంలో విడుదల చేశారన్నారు. ఆడియో ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మణికంఠ రాథోడ్ వ్యాఖ్యలను ఆషామాషీగా తీసుకోలేదన్నారు. ఆయన వ్యాఖ్యల ను కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం పున:పరిశీలించి రుజువైన నేపధ్యంలోరాథోడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తులసిరెడ్డి వెల్లడించారు.

జీవోనంబరు ఒన్‌ను రద్దుచేయాలి: వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీవోనంబరు-1 భావప్రకటనాస్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుందని డాక్టరు ఎన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవోనంబరు ఒన్ విషయం కోర్టులో వ్యాజ్యం నడుస్తోందన్నారు. ఇటు వంటి సమయంలో జీవోనంబరు-1ను మరింత కఠినంగా అమలు చేయాలని సీఎం జగన్ ఆదేశిం చడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రహదారులపై ర్యాలీలు, సభలు నిసేదిస్తూ జగన్ సర్కారు ఈ ఏడాది జనవరి రెండ తేదీన జీవోనంబరు-1ను విడుదల చేసిందన్నా రు. ఈ జీవో అప్రజాస్వామి కమని, భారత రాజ్యాంగ 19 ద్వారా ప్రతి పౌరుడికి ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛ అన్నారు. సీఎం అభద్రతాభావంతో ఓటమి భయం వెంటాడుతోందన్నారు. ప్రభుత్వ వైఫల్యంపై ప్రజా సంఘాలు, ప్రతిపక్షపార్టీలు గొంతెత్తకుండా చేసేందుకు జగన్ పన్నాగం పన్నారన్నా రు. బ్రిటిస్ ప్రభుత్వం కూడా ఇటువంటి దుస్సాహసానాకి ఒడిగట్టలేదన్నారు. మహాత్ముడి దండి యాత్ర కూడా రహదారులపైనే సాగిందన్న విసయాన్ని తులసిరెడ్డి గుర్తుచేశారు. గతంలో ఎన్‌టి రామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు అగ్రనేతలందరితో జగన్ కూడా పాదయాత్ర చేపట్టారన్నారు. సభలు, ర్యాలీలకు భద్రత కల్పించలేని ప్రభుత్వం ఒక ప్రభుత్వమేనా అని తూర్పారబట్టారు. బస్సులు, రైళ్లు ప్రమాదాలు జరుగుతుంటాయని, అందుకు వాటిని రద్దుచేస్తారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి, నాయకులు తిరుపాల్‌రెడ్డి, శ్రీకాంత్, మహేంద్ర, వెంకటరామిరెడ్డి, నరసింహారెడ్డి, ఉత్తన్న, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆశలు రేకెత్తిస్తున్న పత్తి పంట

విశాలాంధ్ర-తొండూరు: ఈ ఏడాది మండల వ్యాప్తంగా సాగు చేసిన పత్తిపంట రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ఏటా వేసవి ఆరంభంలో పత్తిసాగు చేయడం అన్నదాతలకు పరిపాటి. వేరుశనగ, పప్పుశనగ తర్వాత పత్తి ప్రధాన పంటగా సాగు చేస్తారు. ప్రకృతి అనుకూలిస్తే రైతన్నల దశ తిరుగుతుంది. లేదంటే కష్టాలు, కన్నీళ్లు భరించాల్సి వసుతందని రైతులు చెబుతున్నారు. ప్రతి ఏటా ఉగాది పండుగ దాటిన తర్వాత పత్తిపంటసాగుపై మొగ్గుచూపుతారు. ఉగాది తర్వాత వచ్చే మొలకల పౌర్ణమినాటికి మొలక దశలో ఉంటుంది. ఇప్పుడు పత్తికి సమయం కూడా ఆసన్నమైంది. సాధారణంగా ఎకరాలకు మూడూ ప్యాకెట్ల విత్తనాలు ఉపయోగిస్తారు. ప్యాకెట్ ధర రూ.800లు ఉన్నట్లు రైతులు వెల్లడించారు. నాలుగైదేళ్లుగా కృష్ణాజలాలు అందు బాటులో ఉండటంతో సాగు విస్తీర్ణం కూడా ఏటా పెరుగుతూనే వస్తోంది. ఎకరా పత్తిసాగు చేయాలంటే మొత్తం రూ.50నుంచిరూ.60వేలు దాకా ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు. వారానికి ఒకసారి నీరు అందించాల్సి ఉందన్నారు. పైరు మధ్యలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు కూడా చేపట్టాల్సి వస్తుందని రైతులు వెల్లడించారు. దీర్ఘకాలిక పంట కావడంతో పూర్తి దిగుబడి ఇళ్ల చేరాలంటే ఐదు నెలల వ్యవధి పడుతుందని రైతులు చెబుతున్నారు. ప్రకృతి అనుకూలిస్తే ఎకరాకు 12 నుంచి 15క్వింటాళ్ల పత్తి దిగుబడి చేతికందుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం క్వింటా ధర రూ. 8వేల నుంచి రూ.10వేల వరకు పలుకుతోందని అన్నదాతలు సూచనప్రాయంగా వెల్లడించారు. పత్తి ద్వారా వచ్చే ఆదాయం తదుపరి పంటలకు ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు. వీటికి తోడు ప్రభుత్వం కూడా తగు సాయం అందించే అన్ని విధాలా గట్టెక్కుతామని వారు ఆశిస్తున్నారు. ఏది ఏమైనా సర్వశక్తులు ఎదురొడ్డి పత్తిసాగుకు అడుగిడుతున్న అన్నదాతకు ప్రకృతి అన్ని విధాలా సహకరించాలని ఆశిద్దాం.

టీడీపీ హయాంలోనే ముస్లిం మైనార్టీ వర్గాలకు అన్యాయం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : గత టీడీపీ హయాంలో ముస్లిం మైనార్టీ వర్గాల ప్రజలను విస్మరించింది అని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం అన్నారు. ఆదివారం సాయంత్రం ఉపముఖ్యమంత్రి అంజాద్ భాష నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గౌస్ లాజం మాట్లాడారు. టీడిపి నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చెన్నూరు వద్ద 30 అడుగుల గుంతలో హజ్ హౌస్ కట్టి వరద ముంపు ప్రాంతంలో కట్టారని అన్నారు. వరద నీళ్లు వస్తే మునిగిపోతుంది అంతా మునిగిపోతుందన్నారు. ఉర్దూ యూని వర్సిటీ ఏర్పాటు చేస్తామన్న హామీని గత టిడిపి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ముస్లిం వ్యతిరేక ద్రోహులు టీడీపీ నేతలు అని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హజ్ యాత్రకు వెళ్లే వారికి పూర్తి సహకారం అందిస్తుంది అని చెప్పారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి ధరలు కంపెనీలు నిర్ణయిస్తాయని తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హజ్ యాత్ర జరుగుతుందన్నారు. దీనిపై టీడీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేయడం సరికాదన్నారు.

నియోజకవర్గ ప్రజల చూపు టీడీపీవైపు

పండుగ వాతావరణంలో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు పండుగ వాతావరణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారం భోత్సవం జరిగింది.పీలేరు పట్టణంలోని తిరుపతిరోడ్డు విద్యుత్ కార్యాలయం ఎదురుగా తెలుగుదేశంపార్టీ కార్యాలయ ప్రారం భోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,పీలేరు నియో జకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పాల్గొని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభించారు.కిషోర్ కుమార్ రెడ్డి మాటలాడుతు నియోజక వర్గంలో తెలుగుదేశంపార్టీ బలోపేతం కార్యకర్తలతోనే సాధ్యం,ప్రజాక్షేత్రంలో తెలుగుదేశం పార్టీ ముందుంజ.టీడీపీ శ్రేణులు తెలుగుదేశం పార్టీకి చేసే సేవలు మరువలేనివి,టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఎవ్వరినీ వదిలిపెట్టను ఖబర్దార్అనిఅన్నారు.తెలుగుదేశంపార్టీకినాయకులు,కార్యకర్తలు,అభిమానులు అందిస్తున్న విజయాలు, కార్యక్రమాలు,సేవలు వెల కట్టలేనివని,ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని ఆయన భరోసా కల్పించారు.పార్టీ కార్యక్రమాలపై ఎప్పుడు ఆదేశించిన అందుబాటులో ఉండి ప్రతి కార్యక్రమానికి విజయవంతం చేయడం అభినందనీయని టీడీపీ నూతనకార్యాలయంలో కార్యకర్తల్ని ఉద్దేశించి ప్రసంగించారు.తెలుగుదేశం పార్టీ పీలేరు నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగాఅవతరించడంలో ప్రతి కార్యకర్త కష్టం దాగి ఉందని,అది పార్టీ ఎప్పుడు మర్చిపోదని కొనియాడారు.నియోజకవర్గంలో కార్యక్రమాల్లో పాల్గొని వరుస విజయా లు అందిస్తున్న అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాక్షేత్రంలో తెలుగుదేశంపార్టీ ముందుంజలో ఉందని కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు.వైకాపా ప్రభుత్వంపై ప్రజలు అసహించుకోవడం హాస్యాస్పదంగా మారిందని,రాష్ట్రంలో ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు.టీడీపీ కార్యకర్తలకు ఎవరైతే ఇబ్బంది పెడతారో అవే కష్టాలు వారికి తప్పవని హెచ్చరించారు.రాబోయే కాలంలో టీడీపీ గెలవడం ఖాయం నియోజకవర్గ పరిధిలో ఎవరైతే భూ అక్రమాలకు పాల్పడ్డారో ఎవరినీ వదిలిపెట్టే పరిస్థితి లేదనిఅన్నారు.టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఖబర్దార్ ఎవ్వరిని వదిలి పెట్టనని అన్నారు.పీలేరులో నియోజకవర్గంలో ఇంతటితో వైసిపి శకం ముగిసిందన్నారు.

కిషోర్ కుమార్ రెడ్డిని ఒకవైపే చూచారు రాబోయే ఎన్నికల్లో మరోవైపు చూస్తారని అన్నారు.నన్ను నమ్మి నావెంట ఉన్న ప్రతి కార్యకర్తను కాపాడుకొంటూ వారికి న్యాయం చేసే విధంగా అండగా ఉంటానని అన్నారు.నిజాయితీగా రాజకీయాలు ఎన్నో పర్యాయాలు చేశాము ఏనాడు అనవసరంగా అక్రమంగా చేయలేదు.తప్పుడు రాజకీయాలతో తప్పటడుగులతో తాళం వేసేవారిని ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదనిఅన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ పరిధిలో మండల అధ్యక్ష కార్యదర్శిలు,అనుబంధ సంఘాలు,నల్లారి అభిమానులు సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా



మోచా తుఫానుతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-సిద్దవటం : బద్వేల్ ఉద్యానవన డివిజన్ పరిధిలోని సిద్దవటం, గోపవరం, అట్లూరు మండలాలలోని ఉద్యానవన రైతులైన మామిడి, చీని, నిమ్మ రైతులు మోచా తుఫాను అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన అధికారి జయభరత్ రెడ్డి తెలిపారు. మామిడి కోత దశలో ఉన్నందున ఎక్కువగా గాలులు నుండి పంటను కాపాడటానికి పక్వానికి వచ్చిన కాయలను త్వరితగతిన కోయవలెనన్నారు. అలాగే పక్వ్యానికి 10-15 రోజులు ఉన్నా చెట్ల పైన పొటాషియమ్ నైట్రేట్ 10గ్రా ం బోరాక్స్ 1.5 గ్రా లీటరు నీటికి పిచికారి చేయాలి. ఉద్యాన రైతులు రైతు భరోసా కేంద్ర సబ్బంది ద్వారా ఉద్యాన అధికారులు సూచనలను తప్పకుండా పాటిస్తే పంటను కాపాడుకోవచ్చునన్నారు. వర్షం తర్వాత రోజు ఎండగా ఉన్నప్పుడు కావు దశలో ఉన్న తోటులలో బావిస్టిన్ 1గ్రా లీటరు నీటికి కలిపి పిచికారి చేసి కోయ తెగులు నుండి పంటను కాపాడుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి తెలిపారు.

అమ్మకానికి అంగన్‌వాడీ పోస్టులు

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడి పోస్టులను అధికారులు, అధికార పార్టీ నేతలు కలిసి అమ్మకానికి పెట్టారని తక్షణం రీ నోటిఫికేషన్ ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న 12 అంగన్వాడీ కార్యకర్తలు, 40 ఆయా, 4 మినీ అంగన్వాడి పోస్టుల భర్తీ కోసం ఏప్రిల్ 23న జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ నోటిఫికేషన్ జారీ చేసి, మే 3వ తేదీ దరఖాస్తుకు చివరి గడువు విధించి 9న ఇంటర్వ్యూలు నిర్వహించబోతున్నట్లు నోటిఫికేషన్ లో పేర్కొన్నారు అన్నారు. విద్యార్హతతో పాటు ఇంటర్వ్యూ మార్కును కలిపి మొత్తం 100 మార్కులకు గాను విద్యార్హతకు 50 మార్కులు, వితంతువులకు 5 మార్కులు, ఇద్దరు చిన్న పిల్లలు కలవారికి 5 మార్కులు, అనాధలకు 10 మార్కులు, మిగిలిన 30 మార్కులను ఇంటర్వ్యూ చేసే అధికారులు నిర్ణయిస్తారన్నారు. స్థానిక ఎమ్మెల్యే చైర్మన్ గాను, ఆర్డిఓ కన్వీనర్ వ్యవహరిస్తారన్నారు. అయితే ఇప్పటికే అధికార పార్టీ నేతలు దరఖాస్తుదారుల నుండి అంగన్వాడీ కార్యకర్తకు ఐదు లక్షలు, ఆయా పోస్టుకు రెండు లక్షలు వసూలు చేశారన్నారు. అధికార పార్టీ నేతలు ఎంపిక చేయబడిన జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారన్నారు. 9న జరిగే ఇంటర్వ్యూ కేవలం మొక్కుబడిగా జరిపి అర్హుల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. వ్యవహారంలో లక్షలు చేతులు మారాయని నోటిఫికేషన్ రద్దు చేసి రీనాటిఫికేషన్ ఇవ్వాలని, అధికారులు నిర్వహించే ఇంటర్వ్యూ మార్కులు పూర్తిగా రద్దుచేసి పదవ తరగతి మార్కుల ఆధారంగా, అదనపు అర్హతల ఆధారంగా ఎంపిక చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒకవైపు ఉద్యోగ క్యాలెండర్ కు తిలోదకాలు ఇచ్చి, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తూ అరకొరగా చిన్నపాటి ఉద్యోగాలకు కూడా అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఉద్యోగాలను అమ్ముకొని సొమ్ము చేసుకుని నేతల కొమ్ము కాస్తున్నారని వారు తీవ్రంగా విమర్శించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి కేసి బాదుల్లా, డిహెచ్ పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మునయ్య, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, ఏఐవైఎఫ్ నగర కన్వీనర్ ఎస్కె మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాల గోడపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-పులివెందుల రూరల్: స్థానిక గ్రంధాలయంలో ఆదివారం వేసవి శిబిరాల కార్యక్రమాలకు సంబంధించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ వేసవి శిబిరాలు జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ గ్రంధాలయ వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంగడి నాగేంద్ర, మునిబాబు, రాజేశ్వర్‌రెడ్డి, మధు, మహేష్, లాయర్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంటు బాబు, కాశిరెడ్డి, నాగరంగేష్, జయరాజ్, సూర్యచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర-పులివెందుల: సింహాద్రిపురం మండలం కోవరం గుట్టపల్లె గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1988-89 సంవత్సరానికి సంబంధించి పూర్వపు విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు మాట్లాడుతూ చాలా కాలం తర్వాత తాము ఒకే చోట చేరడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలనాటి జ్ఞాపకాలను వారు నెమరువేసుకున్నారు. అక్కడ చదివిన ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాలల్లో స్థిరపడ్డారని, మరెంతో మంది ప్రయోజకలయ్యారన్నారు. ఈ కలయిక తమకు ఎంతో ఆనందాన్ని అందించిందని వారు వెల్లడించారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

విశాలాంధ్ర-పులివెందుల రూరల్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని మానవత స్వచ్ఛ సేవా సంస్థ చైర్మన్ డివి కొండారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మానవతా కేంద్రంలో ఆదివారం గుడ్డసంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండారెడ్డి, టీచరు అంగడి నాగేంద్రలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించంలో భాగంగా గుడ్డ సంచులను సుమారు వంద మందికి అందజేశారు. పర్యావరణ సమతుల్యం కాపాడుకునేందుకు ప్లాస్టిక్ సంచులు వద్దు - గుడ్డ సంచులే ముద్దు అన్న నినాదంతో ముందుకు వెళతామని, ఆ మేరకు ప్రజలకు అవగాహన కల్పించామన్నా రు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - మైదుకూరు : చాపాడు మండలం అన్నవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998-99 విద్యా సం వత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 24 సంవత్సరాల తర్వాత వీరంతా కలిసిన సందర్భంగా గురువుతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు పూర్తి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు ఉన్నతిని తెలుపుతుంటే చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు లక్ష్మీరెడ్డి, జయరాంరెడ్డి, నాగ సుబ్బారెడ్డి, గౌస్, శ్రవణ్, అన్నమాచార్యులు, వెంకటరామిరెడ్డి, అన్నపూర్ణమ్మ దేవితో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాల నిర్వహణ, రుచికర వంటలు తయారు చేయించడంలో కీలకపాత్ర పోషించిన నాగముని రెడ్డి, దస్తగిరి, తస్లిం భానును అందరూ అభినందించారు.

ప్రజల మన్ననలను పొందాలి: మేయర్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రోజురోజుకు నగర అభివృద్ధితో పాటు వివిధ వ్యాపారాల సంస్థలు కూడా అభివృద్ధిలోకి వస్తున్నాయని అందులో భాగంగానే ఆదివారం కడప నగరంలోని ఎన్జీవో కాలనీ నందు వైఎస్సార్సీపీ నాయకులు బండి బాబు సోదరుని కుమారుడు నరేష్ వారి స్నాక్ సిటీ సెంటర్‌ను కడప నగర మేయర్ వైఎస్సార్సీపీ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు కార్పొరేటర్లు, ఇంఛార్జిలు మల్లికార్జున, రామ లక్ష్మణ్ రెడ్డి, శివకోటిరెడ్డి కిరణ్, భాస్కర్ వర్మ, సత్య, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - వల్లూరు : మండలంలోని గంగాయపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు యు.మోక్ష అభినయ్ 563, ఎస్.లక్ష్మి 560, కె.సాయి లక్ష్మి 556, టి.పల్లవి 554 మార్కులు సాధించడం పాఠశాలకు మంచి పేరు తేవడం చాలా సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు ప్రిన్సిపల్ విద్యార్థుల్లో అభినందించారు.

గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చైతన్యర్యాలీ

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : జిల్లా గ్రంథాలయ సంస్థల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 62 శాఖా గ్రంథాలయాలలో మే 8 నుండి జూన్ 11 వరకు జరిగే వేసవి శిక్షణా శిభిరాలను విజయవంతం చేయడంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులతో చైతన్య ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ కొండాయపల్లి,నెహ్రూ నగర్‌లోని పలు వీదుల గుండా ఈ ర్యాలీని నిర్వహించారు. ప్రతి ఇంటికి సమ్మర్ క్యాంపుకు సంబందించిన కర పత్రాలు ఇంటింటికి ఇచ్చి మీ పిల్లలను వేసవి శిక్షణా శిభిరాలకు పంపించాలని కోరారు. ఈ ర్యాలీలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్. అమీరుద్దిన్, ఉప గ్రంథాలయాధికారి ఇ.పవన్ కుమార్, సహాయ గ్రంథాలయాధికారి నాదెండ్ల బాబ్జి, లైబ్రేరియన్స్ సురేష్, సుబ్రహ్మణ్యం, జేమ్స్, సిబ్బంది రామ్‌ప్రతాప్, సుబ్బమ్మ, హరి, రమణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు మే 8 నుండి ప్రారంభించడం జరుగుతుందని ఈ కార్యక్రమము గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి ఆధ్వర్యంలో ప్రారంభిస్తారని ఉప గ్రంథాలయాధికారి పవన్ కుమార్ తెలిపారు.

విద్యార్థులు ఆధ్యాత్మికంతో పాటు విద్య నేర్చుకోవాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో హజ్రత్ బిలాల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, హెచ్.బి మోడల్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ వార్షికోత్సవాల కార్యక్రమాన్ని స్కూల్ కరస్పాండెంట్ షేక్ మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం అంజాద్‌భాష సోదరుడు, వైసిపి నాయకులు ఎస్.బి అహ్మద్‌భాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ చిన్న నాటి నుండే విద్యార్థులు ఆధ్యాత్మికంతో పాటు విద్య నేర్చుకోవాలన్నారు. పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థులందరూ ఉన్నత మార్కులు సాధించినందుకు విద్యార్థులను వారి తల్లిదండ్రులను, స్కూల్ మరియు ఉపాధ్యాయులకు అభినంది స్తున్నామన్నారు. నేటి సమాజంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేలా తయారు కావాలన్నారు. విద్యార్థులకు మంచి విద్య బోధన అందిస్తున్నందుకు స్కూల్ సిబ్బందిను ప్రశంసించారు. అలాగే విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ప్రముఖులు జిలాన్‌భాష, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ సాహిత్యంలో గీతాంజలి గొప్ప రచన

విశాలాంధ్ర-పులివెందుల: ప్రపంచ సాహిత్యంలో గీతాంజలి గొప్ప రచన అని డిఆర్‌డిఎ ప్రాజెక్టు మేనేజరు ఆంజనేయులు కొనియాడారు. స్థానిక వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆవివారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ భారత జాతీయ ఉద్యమంలో రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన గీతాంజలి మహాత్మా గాంధీని మిక్కిలి అభిమాన పాత్రమైన గీతాంజలి రచన ఎంతో ప్రభావం చూపిందని చెప్పవచ్చన్నారు. గీతాంజలిలో ఈ మంత్రములు జపములు విడిచిపెట్టు తలుపులన్నింటినీ బంధించిన ఈ చీకటి గదిలో ఎవరిని పూజిస్తున్నావు? కళ్ళు తెరచి చూడు! నీవు ఆరాధించే దేవుడు నీ ఎదుట లేడు? ఎచ్చట రైతు నేలను దున్నుతున్నాడో! ఎచ్చట శ్రామికుడు రాళ్లు పగలగొట్టు తున్నాడో!అక్కడే ఆ పరమాత్ముడు ఉన్నారని బోధించారన్నారు. వారితో ఎండలో వానలో దూళి ధూపరితములైన వస్త్రములలో ఉన్నారన్నారు. 1913 దశకంలో ఆసియా ఖండంలో ప్రప్రథముగా సాహిత్యంలో నోబెల్ బహుమతి గీతాంజలి రవీంద్రునికి విశ్వకవి బిరుదు సార్థకతమైనదని వెల్లడించారు. భారత జాతీయ గీతం జన గణ మన అధినాయక జయహే భారత భాగ్య విధాత భారతీయులలో అసేతు హిమాచలం ఐకమత్యం సాధించిన ఘనత రవీంద్రనాథ్ ఠాగూర్‌కే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో సోమలూరు రాజా, దేరంగుల ప్రశాంత్ కుమార్, చందు, రాఘవేంద్ర, నంద పాల్గొన్నారు

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రతి విద్యార్థి రవీంద్రనాథ్ ఠాగూర్‌ను గుర్తించుకోవాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వి ఎస్ అమీర్ బాబు అన్నారు. ఆదివారం వారి కార్యాలయం నందు రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి కార్యక్రమం జరిగినది. భారతదేశానికి జనగణమన జాతీయ గీతాన్ని అందించిన మహోన్నత వ్యక్తి రవీంద్రనాథ్ ఠాగూర్ అని కొనియాడారు. మన భారతదేశంలోని నోబుల్ అవార్డును అందుకున్న వ్యక్తి రవీంద్రనాథ్ ఠాగూర్ అని ఆయన గుర్తు చేశారు. టిడిపి సిటీ ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు యువత రవీంద్రనాథ్ ఠాగూర్ ను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సాంస్కృతి కార్యదర్శి అబ్దుల్ రాయల్ కరిముల్లా, ఇస్మాయిల్ భాష తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్ల నడుమ కాపురాలు -ఇబ్బందుల్లో ప్రజలు

విశాలాంధ్ర-తొండూరు: తొండూరు శివార్లలో ఉన్న కాలనీ వాసులు కంపచెట్ల నడుమ కాపురాలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. సుమారు 15ఏళ్ల క్రితం ఇక్కడ కాలనీ ఏర్పాటు చేశారు. సుమారు 50 నుంచి 70 మంది నివాసముండేలా కాలనీ నిర్మించారు. కొన్నాళ్ల పాటు కాలనీని పట్టించుకునేవారు కరువైపోయారు. కనీసం మౌళిక సదుపాయాలు కూడా లేని స్థితి. అయితే కాలగమనంలో కాలనీలో సిమెంటు రహదారులు మరికొన్ని సదుపాయాలు కల్పించారు. ప్రస్తుతం సుమారు 20నుంచి30కుటుంబాలు మాత్రమే జీవనం సాగిస్తున్నాయి. గతంలో సరైన మౌళిక సదుపాయాలు లేనికారణంగా కొంత మంది ఇక్కడ చేరకుండా మరోచోటికి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం కాలనీ చుట్టూ కంపచెట్లు ఆవరించి ఉన్నాయి. అప్పడప్పుడు విషపురుగులు కూడా సంచరిస్తుంటాయని కాలనీ వాసులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో కంపచెట్లను తొలగించి పరిశుభ్రత వాతావరణం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేటి నుంచి వేసవి శిబిరాలు

విశాలాంధ్ర-వేముల: స్థానిక గ్రంధాలయంలో సోమవారం నుంచి వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి గంగాధర్ యాదవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మే 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ క్యాంపు నందు పిల్లలకు కథలు చెప్పడం కథలు చెప్పించడం పుస్తక పఠనం, క్యారమ్స్ మొదలగు ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ వేసవి శిబిరాలను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ఎన్నటికీ తరగనిది మొగమూరు నది

విశాలాంధ్ర- తొండూరు: తొండూరు మం డలం ఇనగలూరు గ్రామ సమీపంలో నిర్మించిన మొగమూ రు వాగులో ఎన్నటికీ నీరు తరగలేదు. బహుశా ఐదారేళ్లుగా ఇక్కడ నీరు పుష్కలంగా ఉంది. వేసవి కాలంలో కూడా నీరు సంపూర్తిగా ఉంది. ఇదంతా దివంగతనేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చలువేనని ఈ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గతంలో ఇనగలూరు సమీపంలో రాకపోకల కోసంచిన్నపాటి వంతెన ఉంది. మెండుగా వర్షాలు వస్తే లేదా వాగుకు ఎగువ భాగాన వరదలు వస్తే వాగు ప్రవాహం వేగంగా ఉంటుంది. ఒక్కోసారి రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడుంది. ఇదిలావుండగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఇక్కడ హైలెవల్ వంతెన ఏర్పాటు చేశారు. వర్షపునీరు పూర్తిగా వెళ్లకుండా కొన్నాళ్ల పాటు నీరు నిల్వ ఉండేలా వంతెన ఏర్పాటు చేశారు. గండికోట ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా మొగమూరు వంతెనకు నీరందించడం అప్పటి వైఎస్ లక్ష్యం. ఈ క్రమంలో గండికోట ప్రాజెక్టు సుమారు 80నుంచి90శాతం పనులు పూర్తయ్యాక వైఎస్ అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వ హయాంలో గండికోట మిగిలు నిర్మాణాలను పూర్తిచేశారు. అనంతరం 2017లో గండికోట నుంచి మొగమూరు వంతెనకు కృష్ణాజలాలను విడుదల చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మొగమూరు వాగులో నీరు పష్కలంగా ఉంది. ఈ మధ్యకాలంలో వేసవిలో కూడా వాగు ఎండిన దాఖలాలు మచ్చుకైనా కనిపించవు. మొగమూరు వాగులో నీరు పుష్కలంగా ఉండటం వల్ల ఈ ప్రాంత రైతులు పదికాలాల పాటు వివిధ రకాల పంటలు పండించుకునే అవకాశాన్ని పాలక ప్రభుత్వాలు కల్పించాయనే వాదన ఈ ప్రాంత ప్రజల్లో వినవస్తోంది. మొత్తంమీద మొగమూరు వాగు ఏ ఒక్క సంవత్సరం కూడా ఎండిపోకుండా పాలకులు నీరందిస్తూనే ఉండటం గర్వించతగ్గ విషయంగా చెప్పవచ్చు.

వీర గాయిత్రి హాస్పిటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలో వీర గాయిత్రి హాస్పిటల్ నూతన భవణాన్ని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. గాంధీరోడ్డులోని అభ్యాస్ జూనియర్ కళాశాల ప్రక్కన నూతన భవణాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత 10సంవత్స రాలుగా ప్రొద్దుటూరు పరిసర ప్రాంత ప్రజలకు అత్యుత్తమ క్రిటికల్ కేర్ వైద్య సేవలు అందిస్తూ మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు అత్యాధునిక పరికరాలు అన్ని సదుపాయాలతో నూతన భవణంలో ఏర్పాటుచేసి ప్రజలకు వైద్యసేవలు అందించడం ఎంతో హర్షించదగ్గ విశయం అన్నారు. డాక్టర్ వీరప్రసాద్ రెడ్డి, డాక్టర్ కందుల సుమిత్రా మాట్లాడుతూ అత్యవసర డెలివరీ కేసులు అన్ని వేళల చూడటం అత్యాధునిక ల్యాపరోస్కోపిక్ మరియు స్కానింగ్ సౌకర్యంతో పాటు సంతానం లేని వారికి పీసీఓడి సమస్యలకు చికిత్స అందించడం ఎన్ఎఫ్ మరియు ఐయూఐ చికిత్స కలదన్నారు. అలాగే చిన్న పిల్లలకు నెలలు నిండకముందే పురిటి బిడ్డలకు అత్యాధునిక చికిత్స, చిన్న పిల్లలకు వచ్చే విశజ్వరాలు, మలేరియా, డెంగ్యూ వ్యాధులకు ప్రత్యేక చికిత్స ఇవ్వడం, అత్యవసర కేసులు అన్ని వేళల చూడటం జరుగుతుదన్నారు. హాస్పిటల్ నూతన భవణ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పట్టణ టీడీపీ ఇంచార్జ్ డా.జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మైదుకూరు టీడీపీ ఇంచార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నా కాలనీని పరిశీలించిన గొర్రె శ్రీనివాసులు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆదివారం నియోజిక వర్గంలోని పెద్దశెట్టిపల్లె గ్రామ సమీపంలో నిర్మిస్తున్న జగనన్నా కాలనీనీ బీజేపీ నియోజికవర్గ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు పరిశీలించారు. నాసిరకంగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణం, పాడైపోయిన బేస్మెంట్ల నిర్మాణంలో జరుగుతున్న అవినీతిని చూసి బీజేపీ నాయకులు ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మణానికి కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందని అయితే ప్రభుత్వం సూచించిన స్టాండర్స్ ప్రకారం ఒక్క ఇల్లు కూడ నిర్మాణం జరగడం లేదని, ఈ విశయంలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపించారు. నిజంగా వైకాపా నాయకులు తమ సొంత ఇళ్లను ఈ విధంగా నిర్మించుకుంటారా అని ప్రశ్నించారు. అడిగే వారు లేరులే అని ఇష్టమొచ్చిన రీతిన జరుగుతున్న నాసిరకం పనులను వెంటనే నిలిపేసి పనులను నాణ్యతా పరంగా చేయాలని డిమాండ్ చేశారు. జగనన్నా కాలనీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై చార్జ్‌షీట్ వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు పి.సుబ్రమణ్యం, రాజుపాళెం మండల అధ్యక్షులు రామసుబ్బయ్య, పట్టణ రూరల్ మండల ఉపాధ్యక్షులు ప్రకాష్, కార్యదర్శి సంజీవ, సోషల్‌మీడియా జిల్లా ఇంచార్జ్ గొర్రె కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో తిష్టవేసిన సమస్యలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని నర్సన్నపల్లె గ్రామంలో కంప చెట్లు రోడ్లపైకి రావడంతో విశపురుగులు రోడ్లపైకి రావడం గ్రామస్థులు, వృద్ధులు, చిన్నపిల్లలు బయటికి రావాలన్న భయాందోళనకు గురౌతు అవస్థలు పడుతున్నారని అధికారుల దృష్టికి తెలిపిన పట్టించుకోకపోవడం ప్రజా ప్రతినిధులు కూడ హామీ ఇస్తారే కాని అమలుచేసే విశయంలో శూన్యం అని గ్రామస్థులు తెలిపారు. చేతిపంపులు మరమ్మత్తులు కూడ నోచుకోలేక నీటికోసం బ్రహ్మంసాగర్ నుండి పైప్‌లైన్ వేసినా గ్రామాలలోకి నీరు కూడ అంతంత మాత్రమే అందుతున్నాయని కోట్లాది రూపాయలు ఖర్చుచేసి ట్యాంకులు ఏర్పాటుచేసిన అవి నిరూపయోగంగానే ఉన్నాయని కనీసం చుక్క నీరు కూడ ఎక్కకపోవడం కాంట్రాక్టర్లకు బిల్లులు తప్ప నీరు శూన్యం అన్నారు. జింకల నగర్‌లో అదే పరిస్థితి ఏర్పడింది. నీటి కోసం ట్యాంకులు కట్టిన అవి నిరూపయోగంగా ఉన్నాయని, అధికారులకు చూడ చెప్పిన పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కంపచెట్లు అన్ని కూడ రోడ్లపైకి గుంపులు గుంపులుగా రావడం జరుగుతుంది.

అద్భుతమైన ఫలితాలు సాధించిన చిన్నకేశంపల్లె విద్యార్థులు

విశాలాంధ్ర- బద్వేల్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ఫలితాల ను సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.వి.రమణయ్య పేర్కొన్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి గాను శనివారం ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ పాఠశాల 89% ఫలితాలను సాధించడమే కాకుండా, తమ పాఠశాల నుండి సి.వెంకటలక్ష్మి 517 మార్కులు సాధించగా, బి.సానియా 494 మార్కులను పొందిందన్నారు. ఉత్తీర్ణులైన 16 మందిలో పది మంది విద్యార్థులు మొదటి శ్రేణిలో పాస్ కావడం గర్వంగా ఉందన్నారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒక ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. 12 సంవత్సరాలలో 10 సంవత్సరాలు 100 శాతం ఫలితాలు సాధించిన ఘనత చిన్నకేశంపల్లె పాఠశాలకు ఉందన్నారు. ప్రతి ఏడాది ఐఐఐటీకి తమ పాఠశాల నుండి ఎంపిక కావడం జరుగుతున్నదన్నారు. మంచి ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించడంతో పాటు, అందుకు కారకులైన ఉపాధ్యాయ సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ మాదన విజయకుమార్, ఉపాధ్యాయులు పి.సుబ్రహ్మణ్యం, టి.పెంచలయ్య, ఎస్.గౌస్ బాషా, ఎస్.శశిధర్ కుమార్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



గుండెపోటుతో విశాలాంధ్ర విలేఖరి మృతి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : చిట్వేల్ మండల విశాలాంధ్ర విలేఖరిగా పనిచేస్తున్న మలిశెట్టి విశ్వేశ్వర గౌడ్ (47) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చాలా కాలంగా విశాలాంధ్ర దినపత్రికలో పనిచేశారు. వివాదరహితుడు, మృదు స్వభావి. విశాలాంధ్ర పత్రికలో ప్రజలలో మంచి పేరు తెచ్చుకున్నాడు. తిరుపతి విశాలాంధ్ర బ్రాంచి మేనేజర్ సుబ్బారాయుడు చిట్వేల్‌కి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి విశ్వేశ్వర గౌడ్ మృత దేహంపై పూలమాలవేసి నివాళులు అర్పించారు. మృతికి సంతాపం వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ విశ్వేశ్వర గౌడ్ కుటుంబానికి ప్రభు త్వం ఆర్థిక సహాయం అందించి అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. విశాలాంధ్ర జాతీయ దినపత్రికలో మంచి మనసుతో చాలా కాలంగా పని చేశారన్నారు. ఇలాంటి వ్యక్తిని కోల్పో వడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వేశ్వర గౌడ్ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకు న్నాయి. విశాలాంధ్ర ఉమ్మడి జిల్లా బ్యూరో పి.రామ సుబ్బారెడ్డి, రైల్వేకోడూరు సీనియర్ జర్నలిస్టులు రామచంద్రారెడ్డి, వంకర సుబ్రమణ్యం, విశాలాంధ్ర, మరియు అన్ని పత్రికల విలేఖరులు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, చిట్వేల్ మండల విలేఖరులు, సిపిఐ, టిడిపి, జనసేన, వైసిపి, సిపిఎం తదితర పార్టీల నాయకులు, పాల్గొని విశ్వేశ్వర గౌడ్ మృతికి సంతాపం వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

విశాలాంధ్ర-రామాపురం : మండల కేంద్రమైన రామాపురంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో నేటి నుంచి జూన్ 16వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించబడతాయని గ్రంథాలయాధికారి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. గ్రంథాలయంలో చిన్నపిల్లలకు పనికివచ్చే కథల పుస్తకాలు విద్యార్థులకు పనికివచ్చే పుస్తకాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. విద్యార్థులకు సెలవు దినాల్లో తమ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రంథాలయంలో విద్యార్థులు వారికి అవసరమైన పుస్తకాలు చదువుకునే అవకాశం కల్పించాలని ఆయన చెప్పారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకోవడం వల్ల తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చుమని అన్నారు. ఈ గ్రంథాలయాల పుస్తకాలు ద్వారా కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం ఎంతైనా ఉంటుందని చెప్పారు.

ఘనంగా శ్రీ పాలేరమ్మ తల్లి జాతర

విశాలాంధ్ర- రామాపురం : మండలంలోని కుమ్మరపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీ పాలేరమ్మ తల్లి 18వ వార్షికోత్సవ జాతర శుక్ర.శని. ఆదివారం మూడు రోజులు పాటు నిర్వహించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జాతరకు గ్రామంలోని కాకుండా చుట్టుపక్కల మండలం ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు అయ్యారు. అమ్మవారికి మొక్కుబడి ఉన్నవారు ముక్కుబడి చెల్లించుకున్నారు ఉదయం నుంచి మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు శుక్రవారం శనివారం రాత్రి అరికథలు భజనలు ఘనంగా నిర్వహించారు ఈ జాతరకు చుట్టు పక్కల గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విందులో పాల్గొన్న అకేపాటి అమర్నాధరెడ్డి

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం కెకె కళ్యాణ మండపంలో జరిగిన సయ్యద్ మస్తాన్ కుమారుడు ఎస్ఎండి ఫైజాన్ ఒడుగులు కార్యక్రమనికి ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, యర్రపురెడ్డి అజయ్ రెడ్డి హాజరై ఆశీర్వదించారు. వీరితో పాటు రెడ్డిచెర్ల ధనుంజయ, స్వామినాథ స్వామి టెంపుల్ చైర్మన్ సోమశ్రీ, సానిపాయి సర్పంచ్ ఆంజనేయులు, నాగేష్, మహేష్‌రెడ్డి, పిటి నాగార్జున, వాటర్ షెడ్ చైర్మన్ మహ్మద్, వెంకటరమణ, జిగిలి సిద్ధూ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజంపేట నియోజకవర్గ అభ్యర్థి (ఇంచార్జ్) బత్యాల చంగల్ రాయుడు హాజరైయారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, పదాధికారులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్‌లో వైయస్సార్ అసోసియేషన్ నాయకులు చేరిక

విశాలాంధ్ర-రాజంపేట : ఆదివారం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జీ.వీ నరసయ్య సమక్షంలో వైయస్సార్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుబ్బయ్య, ఏ.డి.సి జిల్లా నాయకులు పి.ఆర్ రెడ్డి, కండక్టర్ యు.పి కొండయ్య లు ఎంప్లాయిస్ యూనియన్ లో సభ్యత్వం తీసుకున్నారు. జీవీ నరసయ్య వారికి పూలమాలవేసి సాదరంగా యూనియన్ లోకి ఆహ్వానించారు. ఎంప్లాయిస్ యూనియన్ విధివిధానాలు, సాధించిన విజయాల పట్ల ఆకర్షితులై యూనియన్ లో చేరినట్లు వారు తెలియజేశారు. సభ్యత్వం తీసుకున్న వై.సుబ్బయ్యను ఎంప్లాయిస్ యూనియన్ నందు అడిషనల్ డిపో కార్యదర్శిగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జీ.వీ నరసయ్య ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఉపాధ్యక్షులు ఎం.రమణయ్య, జిల్లా ముఖ్య ఉపాధ్యక్షులు చల్లా వెంకటేష్, డిపో కార్యదర్శి బి.సి శేఖర్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్, కోశాధికారి మౌలా, ముఖ్య సలహాదారులు.. సీనియర్ నాయకులు చలపతి, మ్యాథ్యూస్, చంద్రయ్య, బలరాం, రత్నం, భద్రయ్య, కృష్ణ, చిన్నోడు, పరశురాం, నారాయణ, రహమతుల్లా, నరసింహులు, షేక్ షా తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

ఊటుకూరు చెరువులో ఇద్దరు యువకులు మృతి- ఒకరి మృతదేహం లభ్యం, మరొకరి కోసం గాలింపు చర్యలు

విశాలాంధ్ర-రాజంపేట : ఈత సరదా రెండు ప్రాణాలను బలిగొన్నది. పాలిటెక్నిక్ పూర్తి చేసి భవిష్యత్తుపై కలలుగంటున్న యువకుడు ఒకరైతే.. కడప ఆర్టీవో కార్యాలయంలో తండ్రి స్థానంలో ఉద్యోగం చేసుకుంటూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న యువకుడు మరొకరు. స్నేహితులతో కలిసి ఆదివారం సరదాగా నలుగురు యువకులు ఆదివారం మధ్యాహ్నం మండల పరిధిలోని ఊటుకూరు చెరువు లోకి ఈతకు వెళ్లారు. చెరువులో అక్కడక్కడా గుంతలలో నీరు ఉండడంతో ఆ గుంతల్లోనే ఈత కొడుతూ లోతు ఎక్కువున్న ప్రాంతానికి వెళ్లడంతో కాసేపటికే యశ్వంత్ కుమార్ (23), ధనుష్ (20) అనే యువకులు గల్లంతైనట్లు సమాచారం. మిగిలిన ఇద్దరు యువకుల సమాచారం మేరకు హుటా హుటిన అర్బన్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టి యశ్వంత్ కుమార్ మృతదేహాన్ని వెలికి తీశారు. ధనుష్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. యశ్వంత్ కుమార్ పాలిటెక్నిక్ చేసి తండ్రి మరణించడంతో తల్లి ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తూ కుమారుడికి ఉపాధి కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కనిపించకుండా పోయిన ధనుష్ పట్టణంలోని గంగిరెడ్డిపాలెం లో ఉంటూ కడప నగరంలోని ఆర్టీఓ కార్యాలయంలో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్న తన తండ్రి కృష్ణ పక్షవాతంతో మంచాన పడడంతో తండ్రి స్థానంలో కడపలో విధులు నిర్వర్తిస్తూ ఉండేవాడని, ప్రతిరోజు రాజంపేట నుంచి కడపకు వెళ్లి వచ్చేవాడని, ఆదివారం సెలవు కావడంతో సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి కానరాని లోకాలకు వెళ్లాడని తెలిసింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని ధనుష్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు.

సమష్టి కృషితోనే టెన్త్‌లో రాష్ట్రస్థాయి మార్కులు

విశాలాంధ్ర -రాజంపేట: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ,సహకారం కూడా అవసరమని రాజంపేట రాజు హై స్కూల్ ప్రధానోపాధ్యాయు డు రఘురామరాజు , అకడమిక్ ఇంచార్జ్ శేషారెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం రాజు హై స్కూల్లో రాజంపేట టెన్త్ ఫలితాల్లో592 మార్కులు సాధించి టాపర్గా, రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన హాసిని, మధుశాలిని లను , విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. అలాగే రాహిత్య లక్ష్మి 589, నిషిత సాయి 586, యశస్విని 584,హాలేఖ్య ,,583, ధరణి, కోమల్ వర్మ 582, సాదిక్581 మార్కులు సాధించిన సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు ,ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల అంకిత భావంతో వ్యవహరిస్తే తప్పక ఫలితాలు వస్తాయని అన్నారు. సమిష్టి కృషితోనే ప్రస్తుతం మధు శాలిని. హాసిని కూడా 5 92 మార్కులు సాధించగలిగారని పేర్కొన్నారు. సమిష్టి కృషితోనే 2012 నుంచి రాజు హై స్కూల్ రాజంపేటలో టెన్త్ ఫలితాల్లో నెంబర్ వన్ గా నిలుస్తోంది అన్నారు. రాష్ట్రంలో ఏ హైస్కూల్లో కూడా 39 మంది విద్యార్థులకు పది పాయింటు రాలేదని కేవలం రాజు హై స్కూల్ కి ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ రాజు హైస్కూల్లో చదవడం గర్వ కారణంగా ఉందని పేర్కొన్నారు. తమ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో లోయర్ సెక్షన్ ఇంచార్జ్ హబీబ్ , తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా సాగిన లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: చిన్నమం డెం మండలం లోని దేవ గుడిపల్లి గ్రామపంచాయతీ శ్రీ మాండవ్య నది ఒడ్డున ప్రముఖ వాక్య కారుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్య ఆరాధించిన పురాతన దేవాలయం శ్రీ మండ్యం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను బుధవారం నుండి అంగరంగ వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం వేద పండితులు శాస్త్రవేత్తల నడుమ శ్రీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు మండల వ్యాప్తంగానే కాకుండా వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున మహిళలు కుటుంబ సభ్యులతో కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు రాత్రికి గరుడ వాహనంపై స్వామి వారు గ్రామంలోని కురవపల్లి, దేవగుడిపల్లి, బాపూజీ నగర్ కాలనీ, ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ ఏడు రోజులపాటు ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నైవేద్యాలు సమర్పించి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

చికిత్స కోసం వెళుతూ వ్యక్తి మృతి

విశాలాంధ్ర-రామాపురం : అన్నమయ్య జిల్లా కలకడ మండలం నడింపల్లికు చెందిన కే రాజశేఖర్ (43) అనే వ్యక్తి ఆదివారం చికిత్స కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై కొండారెడ్డి తెలిపారు. వివరాలలోకి వెళితే. రాజశేఖర్ కడప నుంచి రాయచోటికి స్కూటర్లో వెళ్తుండగా మార్గమధ్యలోనికి రాగానే కర్నూలు - చిత్తూర్ 40వ జాతీయ రహదారి లోని రామపురం మండలం బండపల్లి టోల్గేట్ దగ్గరకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. సంఘటనలో తీవ్రంగా గాయపడిన రాజశేఖర్ ను చికిత్స కోసం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ఆదివారం మెరుగైన వైద్యం కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు ఎస్సై కొండారెడ్డి తెలిపారు. మృతిని శివ పరీక్ష కై రాయిచేటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శివ పరీక్ష అనంతరం తన భార్య కుటుంబ సభ్యులకు శవాన్ని అప్పగించి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొండారెడ్డి తెలిపారు.

విప్లవ ఝరి అగ్గిపిడుగు అల్లూరి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : బ్రిటిష్ సామ్రాజ్య వాదులపై మూడు సంవత్సరాలు ప్రత్యక్ష సాయుధ పోరాటం జరిపి తెలుగు జాతి పౌరుష ప్రతాపాలను ప్రపంచానికి చాటి చెప్పిన విప్లవ ఝరి అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు అని బిజెపి సీనియర్ నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి గడ్డం చంగల్ రాజు కొనియాడారు. అల్లూరి సీతారామరాజు 99 వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉదయం కోడూరు టౌన్ లోని టోల్ గేట్ సమీపంలో ఉన్న అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా చంగల్ రాజు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన ధైర్యసాహసోపేతుడు అల్లూరి అన్నారు. అట్టి ధైర్య సాహసాలను ప్రకటించి ప్రశంసాపాత్రులగు వీరులరుదు అని జవహర్ లాల్ నెహ్రూ ప్రకటించారన్నారు. బిజెపి నాయకులు సుబ్బారావు, నాగినేని బాలసుబ్రమణ్యం, జయప్రకాష్ నారాయణ వర్మ, సాంబశివ, చలపతి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

ఆరెమ్మతల్లికి జడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా టిసుండుపల్లి మండల కేంద్రం లోని నడిబొడ్డులో గల ఆరెమ్మ తల్లి ఆలయంలో జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ నాయకులు యర్రపురెడ్డి అజయ్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి యర్రపురెడ్డి ఆరంరెడ్డి, స్వగృహానికి తేనేటి విందులో పాల్గొన్నారు.

అజయ్ రెడ్డితో భేటీ అయిన విజయసాగర్ రెడ్డి

విశాలాంధ్ర- సుండుపల్లె : రాజంపేట నియోజకవర్గ వైసీపీ నేత విజయ సాగర్ రెడ్డి ఆదివారం సుండుపల్లెలోని వివిధ కార్యక్రమాలకు హాజరై వైసిపి ముఖ్యనేత యర్రపురెడ్డి అజయ్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి యర్రపురెడ్డి ఆరంరెడ్డితో పాటు ముఖ్య నేతలతో భేటీ అయ్యి మండల సమస్యలు కార్యకర్తల సంక్షేమం గురించి తెలుసుకున్నారు. వారితో పాటు మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భవతులకు యోగా సదస్సు

విశాలాంధ్ర-మాదనపల్లి రూరల్: స్థానిక శ్రీకృష్ణ కళ్యాణ మండపం నందు గర్భవతులకు నెలసరి సమయం లో కాన్పులు సులభంగా కావడానికి. యోగ ఆసనాలు చేయడం వల్ల. ఆపరేషన్ లేకుండా సులభంగా కానప్పుడు జరుగుతాయి అని తెలిపారు. ఆరోగ్యకరంగా కూడా ఉండాలని తెలిపారు

బలహీన వర్గాలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: బలహీన వర్గాలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైఎస్ఆర్ సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారంరాయచోటి మున్సిపాలిటీ లోని 24 వ వ సచివాలయం,33 వ వార్డులో మాసాపేట గొల్లపల్లె, రాజీవ్ స్వగృహ లలో ఉదయం 6 గంటలకే ప్రారంభించిన గడప గడపకు మన ప్రభుత్వం లో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటా శ్రీకాంత్ రెడ్డి పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరిస్తూ, సమస్యలపై ఆరా తీస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాల లబ్ధి అందుతోందన్నారు.

ప్రజలతో మమేకం.. సమస్యల పరిష్కారం: గొల్లపల్లె లో ఎర్రగండ్ల చిట్టెమ్మ తమకు వైఎస్ఆర్ చేయూత ద్వారా ఆర్థిక సహాయం అందిందని ఎంఎల్ఏ ఎదుట హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ కాలనీగా రాజీవ్ స్వగృహ: ఆదర్శ కాలనీగా రాజీవ్ స్వగృహను తీర్చిదిద్దుతామని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు.రాజీవ్ స్వగృహ (ఆనంద నిలయం) లో పర్యటించిన శ్రీకాంత్ రెడ్డికి రాజీవ్ స్వగృహ వాసులు ఆత్మీయ, ప్రేమాభిమానాలుతో ఇంటింటా స్వాగతాలు పలికారు. త్రాగునీరు, పారిశుధ్యపు పనులు, రహదారి మరమ్మత్తులు పై శ్రీకాంత్ రెడ్డి చర్చించారు. రూ.7 కోట్ల నిదులుతో రాజీవ్ స్వగృహలో అభివృద్ధి పనులు చేపడతామని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి కృషి అభినందనీయం: రాజీవ్ స్వగృహ అభివృద్ధిలో ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి చూపిస్తున్న చొరవ, కృషి అభినందనీయమంటూ రాజీవ్ స్వగృహ వాసులు ఆనందం వ్యక్తం చేశారు.రాజీవ్ స్వగృహ కార్పోరేషన్ మూతపడిన దశలో ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి రాజీవ్ స్వగృహ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారని, ఇప్పుడు 120 గృహాల నిర్మాణాలు జరిగాయని, కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్న మీ మేలు మరువలేమంటూ ఇంటింటా రాజీవ్ స్వగృహ వాసులు ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కమీషనర్ గంగా ప్రసాద్, స్థానిక కౌన్సిలర్ జ్యోష్న, నేలపాటి వెంకటేష్, ఆంజనేయులు, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్,సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, ఆసీఫ్ అలీఖాన్, కొలిమి ఛాన్ బాష, గౌస్ ఖాన్, జానం రవీంద్రా యాదవ్, అన్నా సలీం, కో ఆప్షన్ అయ్యవారు రెడ్డి, హజరత్ ఖాదర్ వలీ, జి ఎం డి ఇమ్రాన్ ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు ప్రగతికి మలుపు:కాంగ్రెస్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : కర్నాటక రాష్ట్రంలో గంగా వతి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇక్బాల్ అన్సర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించి ప్రగతికి బాటలు వేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు లీలా శ్రీనివాస్ కొండేటి ఓటర్లకు పిలుపు నిచ్చారు.రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆదేశాల మేరకు లీలాశ్రీనివాస్ కర్నాటక రాష్ట్రంలోని గంగావతి నియోజకవర్గానికి వెళ్లి అక్కడి ఓటర్ల ను అప్యాయంగా పలకరించి కరపత్రం అందజేసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విస్తృత ప్రచారం చేపట్టారు.మే 10 న బుధవారం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ కర పత్రాలు అందజేసి వారిలో చైతన్యం తీసుకువచ్చారు.బిజెపి ప్రభుత్వం గ్యాస్, డీజిల్, పెట్రోల్ మొదలుకొని నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారని ఓటర్ల లో చైతన్యం తీసుకువచ్చారు.బిజెపి ప్రభుత్వం లో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని నిప్పులు చెరిగారు.

విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కు కేరాఫ్ విజయభారతి

విశాలాంధ్ర- మదనపల్లి: విద్యార్థుల ఉన్నత స్థాయి భవిష్యత్ కు కేరాఫ్ గా విజయభారతి విద్యా సంస్థ నిలుస్తున్నదని కురవంక డైనమిక్ సర్పంచ్ పసుపులేటి చలపతి కొనియాడారు..శనివారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో విజయభారతి విద్యా సంస్థ కి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.. దీంతో మదనపల్లి పట్టణం తో పాటు రాష్ట్ర స్థాయి లో విజయభారతి విద్యా సంస్థ పేరు మారుమ్రోగుతుంది..రాష్ట్ర స్థాయి లో అత్యుత్తమ ఫలితాలు సాధించడం తో కరెస్పాండెంట్ డాక్టర్ సేతు కు రాజకీయ నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థలు, విద్యా శాఖ అధికారులతో పాటు పలువురు ప్రముఖుల నుండి అభినందనల వెల్లువ వెలువెత్తుతున్నా యి.. ఆదివారం సైతం అభినందనల వెల్లువ కొనసాగింది. పట్టణంలోని విజయభారతి పాఠశాలకు వెళ్లి కరెస్పాండెంట్ డాక్టర్ సేతు ను కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచం అందచేసి అభినందనలు తెలియజేశారు.. ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి మాట్లాడుతూ విజయభారతి విద్యా సంస్థ స్థాపించిన నాటి నుండి నేటి వరకు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంటూ పేరు ప్రఖ్యాతులు పొందడం గొప్ప విషయం గా పేర్కొన్నారు..విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కు పునాది వేస్తున్న విజయభారతి విద్యా సంస్థ రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కురవంక నారాయణ, విజయకుమార్, ప్రసాద్ ,ఇమ్రాన్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీటీఎం ఎస్టీకాలనీలో పాముల బెడద

విశాలాంధ్ర- నిమ్మనపల్లి: అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం చిన్న తిప్ప సముద్రం చెంచు లక్ష్మి యానాది కాలనీలో విషాలు స్వైర్విహారం చేస్తూ పేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని కొనియాడారు నేడు స్థానికంగా ఎస్టీ కాలనీలో పాములు చాలా పెద్ద పెద్ద పాములు పురవీధులలో ఇండ్ల వద్ద పిల్లల్లో వృద్ధులను పేదలను భయభ్రాంతులకు గురి చేశాయని ఇలా విశ్వసత్వాలు చాలాసార్లు కాలనీలో రావడం జరిగినదని స్థానికంగా పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడంలేదని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని సిటీయంపై సిటీ కాలనీలో పరిసరాల పరిశుభ్రత కనీస మౌలిక సదుపాయాలు లేకుండా పోవడం వల్ల ఎక్కువగా పిచ్చి మొక్కలు ఉండడం వల్ల చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల ఇటువైపు పంచాయతీ అధికారులు చూడడం లేదని వారు వాపోయారు భవిష్యత్తులో ఇలానే అవుతే విష సర్పాలకు బలి కాక తప్పదని ఇప్పటికైనా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం నిస్సహాయత మాని సిటిఎం కాలనీ చెంచులక్ష్మి యానాది కాలనీలో పరిసరాల పరిశుభ్రత కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ చెంచులక్ష్మి యానాది కాలనీ కార్యదర్శి సిద్దయ్య మునికాటయ్య మల్లేష్ వెంకటేశు ఉమా కుమారి నిర్మల గోపాలు తదితరులు పాల్గొన్నారు.

పీలేరు శాఖా గ్రంథాలయలో వేసవి శిక్షణ శిబిరాలు

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు శాఖా గ్రంథాలయము నందు వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం అవుతాయని పీలేరు గ్రంథాలయంధికారి అమరనాథ్ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు నైనార్ మధుబాల అధ్యక్షతన జిల్లా గ్రంథాలయ సంస్థ అన్ని శాఖ గ్రంథాలయాలలో ఈనెల 8 నుండి 11 వరకు వేసవి శిక్షణ శిబిరాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా పీలేరు శాఖ గ్రంథాలయము నందు వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభించడం జరిగిందని ఈ కార్యక్రమములో ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు వయసు గల పిల్లలు శాఖా గ్రంథాలయంలో తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం కోసం అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది పిల్లలకి డ్రాయింగ్,చెస్,క్యారమ్స్, పేపర్, ఆర్ట్, కథలు చెప్పుట, పుస్తక పఠనం ఇంకా అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో రిసోర్స్ పర్సన్ ల చేత ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుంది పిల్లల తల్లితండ్రులు తమ పిల్లలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పీలేరు శాఖ గ్రంథాలయమునకు పంపిన యెడల పిల్లలు శాఖ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవడం అలవాటు అవడమే కాకుండా మంచి సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చునని తెలిపారు.

నేడు స్పందన కార్యక్రమం: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు మే నెల 8 న సోమవారం ఉదయం 10 గంటల నుండి "స్పందన" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి అన్నమ య్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహి స్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా.. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

స్మార్ట్ లైఫ్ గ్రూప్స్ ప్రారంభోత్సవంలో ఎంఎల్ఏ, కడప మేయర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి పట్టణం లోని చిత్తూరు మార్గంలో నూత నంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ లైఫ్ (గ్రూప్స్) ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీకాంంరెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, కడప డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ ల లో పాటు వైఎస్ఆర్సిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్లు పాల్గొన్నారు. రాయచోటి పట్టణంలోని చిత్తూరు రోడ్ హెూండా షోరూం దగ్గర ఆదివారం ఉదయం ప్రారంభించిన స్మార్ట్ లైఫ్ (గ్రూప్స్) ను వైఎస్ఆర్సిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ ప్రారంభించారు, స్మార్ట్ లైఫ్ (గ్రూప్స్) కంపెనీ ప్రతినిధులు బేపారి మహమ్మద్ ఖాన్ ని శాలువతో సత్కరించి భాహుమతిని అందచేశారు. అనంతరం వైఎస్ఆర్సిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ స్మార్ట్ లైఫ్ (గ్రూప్స్) అన్నమయ్య జిల్లా ప్రజల మన్ననలు పొంది దినదినాభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షిచారు.

సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్ర అప్పుల ఊబిలోకి..

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: సంక్షేమ పథకాల పేరుతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని మాజీ ఎమ్మెల్యే రాయచోటి నియోజక వర్గం ఇంచార్జ్ ఆర్ రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు .ఆదివారం ఇదేం కర్మ కార్యక్రమంలో భాగంగా ఎస్ సోమవరం గ్రామంలోని ఎగువ నల్లగుట్టపల్లె ,దిగు నల్లగుట్టపల్లె, బావుల కాడ పల్లె ,ఎస్ సోమవారం కస్పా , శెట్టిపల్లి గ్రామంలో హరిజనవాడ , దిగువరాజు గారి పల్లె, నడిమి రాజు గారి పల్లె, ఎగువ రాజు గారి పల్లె, కడియాలవాండ్ల పల్లె గ్రామాలలో ఇంటింటికి వెళ్లి వైసిపి దురాచకాలను దుర్మార్గాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు బ్యాంకు కోసం సంక్షేమ పథకాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ప్రతి ఒక్కరు వైసిపి పాలనను గమనిస్తున్నారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లతో అధికారాన్ని చేపట్టి వారిపై దాడులు చేయడం సిగ్గుచేటు అన్నారు. అధికారం కోసం ఎంతటి దుర్మార్గానికైనా జగన్ పాల్పడతారని ఇందుకు నిదర్శనం బాబాయి హత్య కోడి కత్తి కేసెనని విమర్శించారు. భూ దందాలు మట్టి మాఫియా అక్రమ ఇసుక రవాణా తో ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొట్టి వేల కోట్లు దోచేస్తున్నారని దుయ్యపడ్డారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచి నిట్ట నిలువునా ప్రజలను దోచేస్తున్నారని దుయ్యబడ్డారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మల్లు నర్సారెడ్డి, మాజీ ఎంపీటీసీ నారా ప్రభాకర్ నాయుడు, టిడిపి మండలఅధ్యక్షుడు చిన్న రెడ్డయ్య యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి, టిడిపి నాయకులు రాళ్లపల్లి వేణుగోపాల్ నాయుడు, నాగార్జున రెడ్డి, రాహుల్ నాయుడు, రామాంజనేయులు, మల్లికార్జున, చంద్రయ్య, రాళ్లపల్లి సాయి, రెడ్డి మోహన్, రాళ్లపల్లి సురేంద్ర తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకలలో ప్రసాద్‌బాబు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన తంబా లపల్లి వారి నిశ్చితార్థ వేడుకలో వినయ్ కుమార్ - వరలక్ష్మిలను మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు, రాయచోటి తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొని నూతన వధూవ రులను ఆశీర్వదించారు. అనం తరం పలువురితో ఆయన పలు విషయాలపై చర్చించారు.

నూతన గృహప్రవేశ వేడుకల్లో సుగవాసి ప్రసాద్ బాబు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి పట్టణం మాసాపేట రాజీవ్ స్వగృహ కలక్టరేట్ ప్రక్కన మాజీ మండలాధ్యక్షుడు గూడూరు మహమ్మద్ రఫీ కుమారుడు గూడూరు ఇర్షాద్ నూతన గృహప్రవేశ వేడుకల్లో మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు రాయచోటి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొని యజమానులకు శు భాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాక్ ఈఏపీ సెట్-2023 కు విశేష స్పందన

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నాడు మాక్ ఈ ఏ పీ సెట్- 2023 నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి పట్టణ, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండల కేంద్రాల నుండి 193 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారని తెలియజేశారు. వెనుకబడిన ప్రాంతమైన రాయచోటి పట్టణంలో ఎటువంటి లాభాపేక్ష లేకుండా 23 సంవత్సరాల నుండి ఎంతో మంది విద్యార్థినీ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తూ వారికి ఉజ్వల భవిష్యత్తు బంగారు బాట వేసిన ఘనత శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలకు దక్కుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కళాశాలలో విద్య నభ్యసించిన ఎందరో విద్యార్థిని విద్యార్థులు అఖిల భారత సర్వీసులలో, ఇస్రో సంస్థలో సైంటిస్టులు గానూ, ప్రభుత్వ, బ్యాంకింగ్ సాఫ్ట్వేర్ రంగంలో దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే ఈ ఏపీ సెట్ లో అర్హత మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వమే కళాశాల, హాస్టల్ ఫీజులను చెల్లిస్తుందని వివరిం చారు. ఇంజనీరింగ్ విద్యలో అన్ని విభాగాలు సమ ప్రాధాన్యతను కలిగి ఉన్నాయని భవిష్యత్తులో ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ విభాగాలలో నిపుణుల కొరత ఎక్కువగా ఉండి ఈ రంగాల్లో డిమాండ్ అధికంగా ఉంటుందని సూచించారు. కళాశాల యందు వివిధ పోటీ పరీక్షలకు అవసరమగు అర్థమెటిక్, రీజనింగ్, కమ్యూనికేషన్స్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ కల్పిస్తున్నామని, అధునాతన డిజిటల్ లైబ్రరీ, యూనివర్సిటీ మరియు జోనల్ స్థాయి క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, ఆన్లైన్ కోర్సులు సర్టిఫికెట్ కోసం మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలతో యంఓయు, ప్రతి సెమిస్టర్ లో సైకాలజిస్టులు, రిసోర్స్ పర్సన్స్ ఆహ్వానించి కెరీర్ గైడెన్స్, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, నైతిక విలువలు పై అవగాహన కార్యక్రమం నిర్వహిం చడం, సెమినార్, టెక్నికల్ పేపర్ ప్రజెంటేషన్ కార్యక్రమాలకు విద్యార్థిని విద్యార్థులను సన్నద్ధం చేస్తూ ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగు పరచడం వంటి వినూత్న కార్యక్రమాలు కళాశా లలో నిర్వహిస్తున్నామని వివరించారు. మాక్ ఈఏపీ సెట్ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ప్రధానం చేశారు. రాయచోటి పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులు వీలైన సమయంలో మరిన్ని ఆన్లైన్ మాక్ ఈ ఏపీ సెట్ ప్రవేశ పరీక్షల కోసం తమ కళాశాల కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాన్ని వినియోగించుకోగలరని సూచించారు .ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలలో ప్రసాద్‌బాబు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ఆదివారం రాయచోటి పట్టణం అభి కన్వెన్షన్ హాల్ లో జరిగిన ఫ్రూట్ కమిషన్ ఏజెంట్ అలీమాబాద్ వీధి వాస్తవ్యులు హాజీ షేక్ మగ్బూల్ బాషా కుమారుడు షేక్ తహీర్ బాషా గారి వివాహ వేడుకలో మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు రాయచోటి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొన్నారు. నూతన వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మైనార్టీలతో సమావేశమై పలు విషయాలపై ఆయన చర్చించారు.

మండెం లక్ష్మీ నరసింహస్వామికి ఎంఎల్ఏ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: చిన్నమండెం మం డ లం జిల్లా వాండ్లపల్లె సమీపంలో ఉన్న మండెం లక్ష్మీ నరసింహస్వామికి ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి, జెడ్ పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథ రెడ్డి లు ప్రత్యేక పూజలు గావించారు.మొలకల పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి, దేవనాథ రెడ్డి లు ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డి, దేవనాథ రెడ్డి లకు పూర్ణకుంభ స్వాగతం పలికి వారిచేత ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహింపచేసి , పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి దుస్సాలువలతో సత్కరించి ఆశీర్వదించారు. రూ 1.50 కోట్ల నిధులుతో త్వరలో చేపట్టనున్న ఆలయ నిర్మాణ అభివృద్ధి పనులుపై శ్రీకాంత్ రెడ్డి, దేవనాథ రెడ్డి లు చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ తిమ్మారెడ్డి, ఉపాధ్యాయు లు భాస్కర్ రెడ్డి, రెడ్డెన్న, ఎంపీటీసీ రమణ,వైసీపీ నాయకులు జయశంకర్ రెడ్డి,శేషా రెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప, రామచంద్ర, సిద్దయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

2024లో టిడిపి గెలుపు తథ్యం

- చంద్రబాబు-పవన్ కళ్యాణ్ కలిస్తే వైసీపీ కి వణుకు -కిషోర్ ను ఓడించేందుకు దుష్టశక్తులు ఏకమవుతున్నాయి
- పీలేరు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతోనే నా గెలుపు తథ్యం - టిడిపి కార్యాలయ ప్రారంభోత్సవంలో కిషోర్ కీలక వ్యాఖ్యలు

విశాలాంధ్ర-పీలేరు: 2024లో టిడిపి గెలుపు తథ్యమని,పీలేరు నియోజకవర్గం ఆశీస్సులతోనే నా గెలుపు పీలేరు తథ్యమని,తమ వద్ద సామాన్య కార్యకర్తలుగా వచ్చి తమనే నమ్ముకున్నామని చెప్పి పదవులు, లాభాలు పొందిన వారు నేడు వారి భూములు వేలకోట్ల ఆక్రమణలు కాపాడుకోవడం కోసం వైసీపీలో వెళ్లిన వారిని టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎవరిని వదిలే ప్రసక్తే లేదని, కిషోర్ ను ఓడించేందుకు దుష్టశక్తులు ఏకమవుతున్నాయని ఎన్ని దుష్టశక్తులు ఏకమైన సింహం సింగల్ గానే ఉంటుందని దాన్ని గిలికితే ఆ సింహం (కిషోర్)వెనకాల పీలేరు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు,కొండంత అండ ఉందని తమ గెలుపుకు పీలేరు నియోజకవర్గం ప్రజలే ఉన్నారని పేర్కొంటూ అసలు రాష్ట్రంలో చంద్రబాబు,పవన్ కళ్యాణ్ కలిస్తే వైసీపీకి ఎందుకో వణుకు పుడుతున్నదని టిడిపి నూతన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో కిషోర్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలు టిడిపికి ఎక్కువగా భాగం పబ్లిసిటీ చేస్తున్నది వైసిపి అని వారి విమర్శనస్త్రాలే తమ గెలుపుకు నిదర్శనం అని ఆయన వ్యాఖ్యానించారు. ఆ ముగ్గురికి (మంత్రి,ఎంపీ,ఎమ్మెల్యే,)కలలో తనే కనబడుతున్నానని వారికి నిద్ర కూడా పట్టడం లేదని ఆయన చమత్కరించారు కిషోర్ ను ఒక వైపే చూశారని ఇకనుంచి ఇంకొక వైపు చూస్తారని అన్నారు.టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నాలుగేళ్లలో తనకు నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు తను వెన్నంటే ఉండి వారికి తగిన ప్రాధాన్యత,సముచిత స్థానం కల్పిస్తామని కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తను నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా వారికి ఆపన్న హస్తముల ఆదుకునేందుకు కిషోర్ కుమార్ రెడ్డి అను నిత్యం,ఎల్లప్పుడు ముందుటానని భరోసా ఇచ్చారు. టీడీపీ ప్రతి కార్యకర్త వైసిపి వ్యతిరేక కార్యకలాపాల గురించి ప్రజలకు వివరించి సైనికుల పనిచేసి టిడిపి గెలుపుకు కృషి చేయాలని ఆయన ఉద్బోదించారు. అదేవిధంగా రానున్న ఎన్నికలలో టీడీపీకి 150-160 సీట్లు రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ పరిధిలో మండల అధ్యక్ష కార్యదర్శిలు,అనుబంధ సంఘాలు,నల్లారి అభిమానులు సంఖ్యలో పాల్గొన్నారు.

37 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 37 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో అర్హులైన 37 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి,ఉచితంగా అద్దాలు,మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప్ గుప్తా,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష,ఏపీఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి,కంటి వైద్యులు సురేష్ బాబు,భార్గవి,మహాలక్ష్మి,ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.